క్లుప్తంగా

ప్రత్యేకాధికారి బదిలీ

ధరూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పని చేస్తున్న ప్రత్యేకాధికారి యాదమ్మపై కలెక్టర్ వల్లూరి క్రాంతికి ఇటీవల విద్యార్థినుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేజీబీవీలో పిల్లలను చేర్పించడానికి వచ్చిన వారితో దురుసుగా వ్యవహరిస్తుందని విన్నవించారు. ఈ మేరకు కలెక్టర్ స్పందించి ప్రత్యేకాధికారిని గట్టుకు కేటాయించాలని ఆదేశించారు. త్వరలోనే పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్య తీసుకుంటామని డీఈఓ సిరాజుద్దీన్ తెలిపారు.

ఇంటింటి సర్వే

ఉండవెల్లి: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తప్పులేని ఓటరు జాబితాను రూపొందించేందుకు అధికారులు, బీఎల్వోలు ఇంటింట సర్వే నిర్వహిస్తున్నారు. శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో 545 ఇండ్లు సర్వే చేసినట్లు తహసీల్దార్ వీరభద్రప్ప తెలిపారు. ఉండవెల్లి, తక్కశిల, బొంకూరు గ్రామాల్లోని మేజర్ పంచాయతీల్లో అధికంగా 50 నుంచి 60 ఇండ్లను సర్వే నిర్వహించామని పేర్కొన్నారు. మండలం మొత్తం 29 మంది బీఎల్వోలు, ఐదుగురు వీఆర్ఏలు, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, డీటీ జయంతి సర్వేను పర్యవేక్షిస్తున్నారని వివరించారు.

గ్రామ కమిటీ ఎన్నిక

అయిజ: మండలంలోని కిష్టాపురంలో కాంగ్రెస్ గ్రామ కమిటీని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జయన్న ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రవీందర్, గొల్ల మహేష్, మద్దిలేటి, ఉరుకుందు, రామకృష్ణ, మధు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



అయిజ: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎయిమ్స్ రాష్ట్ర కోఆర్డినేటర్ మేది ప్రముఖ్ అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శనివారం పట్టణ పరిధిలోని సంత బజార్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పోషకాల గురించి చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పోషకాహారం లోపం వల్ల కలిగే నష్టాలను వివరించారు. వారి వెంట సూపర్‌వైజర్లు యామిని, వాసంతి, తెల్లమ్మ పాల్గొన్నారు.

గరుడ యాప్‌తో సమయం ఆదా

రాజోళి: ఓటరు నమోదు, జాబితా నుంచి తొలగింపు ప్రక్రియకు గరుడ యాప్ ద్వారా సులువుగా చేయవచ్చని దీంతో సమయం ఆదా అవుతోందని తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాప్ ద్వారా వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. బీఎల్ఓల సందేహాలను నివృత్తి చేశారు. వివరాలను వేగంగా పూర్తిచేయాలని కోరారు.

అధిక సంఖ్యలో మొక్కలు నాటాలి

రాజోళి: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల పురస్కరించుకుని ప్రతి గ్రామంలో అధిక సంఖ్యలో మొక్కలు నాటాలని ఎంపీడీఓ గోవిందు రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఉపాధి హామీ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటేందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశామని, సంబంధిత సిబ్బంది పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో విజయవంతం చేయాలన్నారు. సిబ్బందికి పలు సలహాలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

గద్వాల క్రైం: ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం మండలంలోని పూటన్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మ పక్కన ఉన్న పాపమ్మ ఇంటి దగ్గరలో చెత్తను వేసింది. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటమాట పెరిగి ఇరువర్గాల కుటుంబ సభ్యులు ఘర్షణ పడ్డారు. దీంతో ఇరువర్గాల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అన్నపై తమ్ముడి దాడి

గద్వాల క్రైం: అన్నపై తమ్ముడు దాడి చేసిన సంఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం గద్వాల మండల పరిధిలోని కొండపల్లి గ్రామానికి చెందిన డల్లుబాయి రామకృష్ణ, డల్లుబాయి రంగస్వామిలు భూమిని భాగ పరిష్కారం చేసుకున్నారు. అయితే ఆస్తులు అమ్మిన క్రమంలో రూ.15 లక్షల పంపిణీ విషయంలో ఇద్దరు మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో రామకృష్ణపై తమ్ముడు దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పూర్వ వైభవం వచ్చేనా?

- 110 ఎకరాల్లో ఏర్పాటు చేసిన చిట్టిఫారాలు
- నిరుపయోగంగా గోదాములు



జూలెకల్‌లో నిరుపయోగంగా వ్యవసాయ అధికారి కార్యాలయం

శాంతినగర్: దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ అండ్ డెమానుస్ట్రేషన్ (పీడీ అండ్‌డీ) చిట్టిఫారాలు నిరాదరణకు గురవుతున్నాయి. ప్రస్తుతం ఆదరించేవారు లేక వెలవెలబోతున్నారు. కూలీల సందడి లేక ఎడారిని తలపిస్తున్నాయి. రైతులకు మేలు రకాలైన విత్తనాలు ఉత్పత్తి చేసి విక్రయించేందుకు ప్రభుత్వ చర్యలు చేపట్టింది. మొదట్లో సజావుగా సాగినా ప్రస్తుతం ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. విత్తనాల ఉత్పత్తి కోసం అలంపూర్ నియోజకవర్గంలోని జూలెకల్ స్టేజి సమీపంలో 1980లో అప్పటి ప్రభుత్వం లక్షలు వెచ్చించి 50 ఎకరాల విస్తీర్ణంలో, మానవపాడు మండలం కొర్విపాడు సమీపంలో 60 ఎకరాల్లో విశాలమైన భవనాలు, గోదాములతో వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేశారు. సుమారు పది ఎకరాల్లో భవనాలు నిర్మించారు. మిగిలిన వ్యవసాయ భూమిలో మేలు రకాల వంగడాలు, విత్తనాలకు ఉపయోగపడే వేరుశనగ, వివిధ రకాల మొక్కల నర్సరీలతో కళకళలాడేవి. అంతేగాక చుట్టు పక్కల ఉన్న కొంకల, జూలెకల్, యాపదిన్నె, ముండ్లదిన్నె, తనగల, కొర్విపాడు, కలుకుంట్ల గ్రామాల్లో నివసించే నిరుపేద కూలీలకు అన్నంపెట్టే అన్నపూర్ణలుగా, రైతుల పాలిట మేలు రకాల విత్తనాలు ఉత్పత్తి చేసే వ్యవసాయ క్షేత్రాలు పేరుగాంచాయి. అప్పట్లో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల రైతులు చిట్టిఫారాలు చేరుకుని వారికి కావాల్సిన మేలు రకం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అక్కడే కొనుగోలు చేసి, వ్యవసాయంలో మెలకువలు నేర్చుకుని అధిక దిగుబడుల్లో అగ్రగామిగా నిలిచి ఇతర ప్రాంతాల రైతులకు అలంపూర్ నియోజకవర్గ రైతులు ఆదర్శంగా నిలిచేవారు. ప్రస్తుతం ఆ క్షేత్రాలు వ్యవసాయశాఖ ద్వారా నిరాదరణకు గురై శిథిలావస్థకు చేరిన భవనాలు, గోదాములు, ఉపయోగంలోలేని బోరుబావులు, యాసంగిలో పంటలు సాగుచేయక పోవడంతో ఖాళీ భూమితో దర్శనమిస్తూ ఎడారిని తలపిస్తున్నాయి. నిరాదరణకు గురవుతున్న వ్యవసాయ క్షేత్రంలో మేలు రకాలైన వంగడాలు ఉత్పత్తి చేసి లేదా ఏరువాక కేంద్రాలు, కృషివిజ్ఞాన కేంద్రాలు, మెడికల్ కళాశాల ఏర్పాటుచేసి అటు రైతులకు, ఇటు కూలీలకు, ప్రజలకు ఉపాధి కల్పించేలా, వైద్య సేవలు అందించేలా వ్యవసాయశాఖ వారు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుచున్నారు.

ఖాళీగా దర్శనమిస్తున్న వ్యవసాయ క్షేత్రాలు..

నాలుగు దశాబ్దాల కిందట ఏడాదిపాటు పచ్చని పైర్లు, భవనాలు, నిండిన గోదాములతో అటుగా వెళ్లే రైతులకు, ప్రయాణికులకు దర్శనమిచ్చేవి చిట్టిఫారాలు. ప్రస్తుతం ఏ పంటలు సాగు చేయకపోవడంతో ఎడారిని తలపిస్తున్నాయి. ఇప్పటి రైతులకు అక్కడ చిట్టి ఫారాలు ఉన్నాయనే విషయమే తెలియని పరిస్థితులు దాపురించాయి.

నిరుపయోగంగా బోరుబావులు..

వర్షాకాలంలో వర్షాధారంగా, యాసంగిలో బోరుబావుల్లోని నీటితో పూర్తిస్థాయిలో పచ్చని పైర్లతో వ్యయసాయ క్షేత్రాలు కళకళలాడేవి. ప్రస్తుతం బోరుబావులు నిరుపయోగంగా మారడంతో కేవలం వర్షాధారంతో ఏడాదికి ఒక పంట నామ్‌కే వాస్తేగా పండిస్తూ ఉనికిని కోల్పోతున్నాయి.

లక్షల ప్రజాధనం వృథా..

వ్యవసాయ క్షేత్రాల నిర్వహణకు ప్రభుత్వం ప్రతి ఏడాది లక్షల్లో ఖర్చు చేస్తోంది. అంతేగాక అధికారుల జీతాలు, పంటల సాగుకు పెట్టుబడులు, కూలీలకు లక్షల్లో ఖర్చులు పెడుతూ అంతా నష్టాలను చవిచూస్తున్నారు. నష్టాల బాటలో ఉన్న వ్యవసాయ క్షేత్రాలను ప్రజలకు, రైతులకు ఉపయోగపడే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన భవనాలు, గోదాములు



ఎడారిని తలపిస్తున్న వ్యవసాయ భూమి

కృషి విజ్ఞాన కేంద్రాలుగా చేస్తే బాగుంటుంది..



మేలు రకం వంగడాలు, వ్యవసాయంలో మెలకువలు తెలసుకోవాలంటే పాలమూరు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాల్సి వస్తోంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎక్కడ కూడా కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రాలు లేవు. 110 ఎకరాల విస్తీర్ణంలో రెండు చోట్ల ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో వాటిని నిర్మించి రైతులకు ఉపయోగపడేలా చేస్తే బాగుటుంది.

– బత్కన్న, రైతు, యాపదిన్నె

మెడికల్ కళాశాల నిర్మించాలి..



జోగుళాంబ గద్వాల జిల్లాలో మెడికల్ కళాశాల లేదు. అలంపూర్ చౌరస్తాలో ప్రస్తుతం వంద పడకల ఆస్పత్రి నిర్మిస్తున్నారు. జూలెకల్ చిట్టిఫారమ్‌లో మెడికల్ కళాశాల నిర్మిస్తే బాగుంటుంది. అలంపూర్–రాయచూర్ రోడ్డు సమీపంలో ఉన్నందున ప్రజలకు ఉపయోగపడే విధంగా వైద్య కళాశాల నిర్మించాలి.

–బంగారు మహేశ్వర్‌రెడ్డి, కొంకల

పప్పు దినుసుల పంటలకే ప్రాధాన్యం



పీడీ అండ్ డీ కేంద్రాల్లో పప్పు దినుసుల పంటలు సాగుచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అధికారుల సూచన మేరకు కంది పంటనే సాగు చేస్తున్నాం. గతంలో మినుములు, వేరుశనగ, వరి పంటలు సాగు చేసినా నష్టాలు వచ్చాయి. పంటల దిగుబడి రాక పోవడంతో ప్రస్తుతం కంది సాగుకే ప్రాధాన్యం ఇస్తున్నాం.

– సక్రియ నాయక్, ఏడీఏ, అలంపూర్

తండాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



నేతువానిపల్లి తండాలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారెడ్డి

మల్దకల్: గిరిజన తండాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డిలు అన్నారు. శనివారం మండలంలోని నేతువానిపల్లి తండా, మద్దెలబండ పెద్దతండాలలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గిరిజనుల అభ్యున్నతికి, తండాల అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు వీరేష్, తాన్యానాయక్, నాయకులు తిమ్మారెడ్డి, అజయ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు ఇవ్వకుండా ప్రభుత్వం కుట్ర



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్

అయిజ: సకాలంలో కుల, ఆదాయ ధ్రువపత్రాలు అందకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్ ఆరోపించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంవద్ద ఇబ్బందులు పడుతున్న వారితో శేఖర్ మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడురోజుల నుంచి సర్వర్ పనిచేయకపోవడంతో రుణాల కోసం దరఖాస్తు దారులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. తహసీల్దార్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణాల కోసం దరఖాస్తు చేసేందుకు గడువు పెంచాలని డిమాండ్ చేశారు.

బడిబయటి పిల్లలను బడుల్లో చేర్పిద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ రజిత

శాంతినగర్: బడి బయటి పిల్లలందరిని బడుల్లో చేర్పిద్దామని ఎంపీపీ రజిత అన్నారు. శనివారం ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి పాఠశాలల యాజమాన్య కమిటీల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరై మాట్లాడారు. ఆడపిల్లలు ఉన్నత చదువు చదివించాలని, బాల్య వివాహాలు చేసి జీవితాలను నాశనం చేయొద్దని సూచించారు. ఎస్ఎంసీ సభ్యులు పిల్లల హాజరు శాతాన్ని పెంచేలా చూడాలని కోరారు. ఎంపీడీఓ రవీంద్ర మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అన్నారు. బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, నాగపుల్లయ్య, ఎస్ఎంసీ కన్వీనర్ ఆంజనేయులు, ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు



పల్లెపాడులో ప్రార్థనలో విద్యార్థులు

మానవపాడు: మండలంలోని పల్లెపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల సమయపాలన పాటించడం లేదు. వారం రోజులుగా ఉపాధ్యాయులు ప్రార్థన సమయానికి రావడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. దీంతో విద్యార్థులే ప్రార్థనను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో కూడా తెలియని పరిస్థితి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఉపాధ్యాయులు సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈవిషయమై ఎంఈఓ శివప్రసాద్ వివరణ కోరగా పాఠశాలకు సమయానికి రాని ఉపాధ్యాయులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చోరీ ఘటనపై వివరాలు సేకరణ



అయిజ: పట్టణంలోని భరత్‌నగర్ కాలనీలో ఈనెల 8న ఉపాధ్యాయుడు హరి ఇంట్లో చోరీ జరిగిన విషయం విధితమే. ఇందులో భాగంగా శనివారం శాంతినగర్ సీఐ శివశంకర్‌గౌడ్, ఎస్ఐ నరేష్‌కుమార్‌లు కాలనీలోని పరిసరాలను పరిశీలించారు. సమీపంలోని ఇళ్ల వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

కస్తూర్బా పాఠశాలకు వంటపాత్ర అందజేత



అయిజ: విద్యార్థులకు వంట చేసేందుకు శనివారం పాత్రను బీఆర్ఎస్వీ జోగుళాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ సతీమణి ప్రేమలత కస్తూర్బా పాఠశాలకు అందజేశారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా అందజేసినట్లు దాత తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని ఆమె కోరారు.

బోల్తాపడిన లారీ

అయిజ: మండలంలోని కొత్తపల్లి గ్రామ సమీపంలో శనివారం సిమెంట్ లారీ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. స్థానికుల వివరాల ప్రకారం అయిజ నుంచి కొత్తపల్లికి సిమెంట్ లోడ్ లారీ బయలుదేరింది. కొత్తపల్లిలో కొన్ని సిమెంట్ బస్తాలను దించి తిరుగుపయనం అయ్యింది. గ్రామ సమీపంలో లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో లారీలో డ్రైవర్‌తోపాటు ఆరుగురు హమాలీలు ఉన్నారు. అందరు స్వల్ప గాయాలతో బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

నర్వ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే ప్రతి విద్యార్థికి ఉచిత పాఠ్యపుస్తకాలను, యూనిఫామ్స్‌ను ప్రభుత్వం అందిస్తుందని ఎంపీపీ జయరాములుశెట్టి అన్నారు. శనివారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలకు దాదాపు 95 శాతం అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు నర్సిములు, రోజా, సిబ్బంది రైసబాను, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో గుణాత్మక మార్పు



ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల్లో గుణాత్మకమైన మార్పును తీసుకురావడమే ప్రభుత్వ ధ్యేయమని అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. శనివారం ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 44వ జాతీయ రహదారి నుంచి ధర్మవరం వరకు రూ. 42.5 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు రెన్యూవల్ నిర్మాణం పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఉదండాపురం, షాబాద్ గ్రామాల్లో పర్యటించి పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు ఉన్నతమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయా గ్రామాల్లో బీసీ, ఎస్సీలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను స్థానిక తహసీల్దార్‌తో కలిసి సందర్శించారు. అర్హులైన లబ్ధిదారులకు త్వరలోనే ఇండ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి గ్రామంలో కూడా ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసిందన్నారు. పారిశుద్ధ్యం కోసం ట్రాక్టర్లు, డంపింగ్‌యార్డులు, వైకుంఠదామాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి ఇంటికి నల్లా ద్వారా శుద్ధమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో వేల కోట్లను ఖర్చుచేసి మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టి నీటిని అందిస్తుందన్నారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మదు నాయుడు, వెంకటేశ్వర్లు, మల్లేష్, హుసేన్, గోవర్ధన్ రెడ్డి, సుంకన్న, యుగేంధర్‌రెడ్డి, సూరి, ఈదన్ననాయుడు, వేణుగోపాల్ నాయుడు, ఆయా శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇటిక్యాల మండలంలోని వల్లూరుకు చెందిన వార్డు మెంబర్ కుర్వ శేఖర్ తండ్రి గోపాల్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం శనివారం వల్లూరు గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

విద్యా దినోత్సవం విజయవంతం చేయాలి



హాజరైన ప్రధానోపాధ్యాయులు

ధరూరు: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న నిర్వహించే విద్యాదినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ సురేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో ధరూరు, కేటీదొడ్డి మండలాల హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పాఠశాలను శుభ్రంగా ఉంచడంతో పాటు విద్యాభిమానులు, ఎంఎంసీ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులతో కలిసి ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ఉదయం 9.30 గంటలకు జాతీయ పతాకం ఆవిష్కరించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించాలని సూచించారు. అదే రోజు విద్యార్థులందరికి పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేయాలన్నారు. అలాగే జిల్లా స్థాయిలో టీఎల్ఎం మేళా ఉంటుందని వివరించారు. మండల స్థాయిలో గెలుపొందిన ఉపాధ్యాయులు టీఎల్ఎం మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంలు నరేష్, శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థి ఎంపిక



విద్యార్థి హర్షవర్ధన్‌రెడ్డిని అభినందిస్తున్న జెన్‌కో ఎస్ఈ రామసుబ్బారెడ్డి

ధరూరు: అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి జూలై 5వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని భూపాల్‌లో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు మండలంలోపి డీఏవీ పాఠశాల విద్యార్థి ఎంపికయ్యారు. మండలంలోని భీంపురం గ్రామానికి చెందిన విద్యార్థి హర్షవర్ధన్‌రెడ్డి ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. శనివారం జెన్‌కో ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఏవీ విద్యా సంస్థల ఏఆర్ఓ జీఆర్‌కే ప్రసాద్‌లు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ యాధవరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎల్ రవి పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు తీసుకోవాలని వినతి



అలంపూర్‌లో వినతి పత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

అలంపూర్: పట్టణంలో పారిశుద్ధ్యం లోపించిందని బీఎస్పీ మండల అధ్యక్షుడు నాగరాజు అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బీఎస్పీ నాయకులతో కలిసి మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 2వ వార్డు సంతోష్ నగర్ కాలనీలో నివాస గృహాల డ్రెయినేజీ నిండి రోడ్లపై పారుతోందని విన్నవించారు. మురుగు దోమలకు ఆవాసాలుగా మారి మలేరియా, డెంగ్యూ వంటి రోగాలబారిన పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్లపై మురుగు నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కన్వీనర్ సురేష్, నాయకులు సుధాకర్, తిక్కన్న, అచ్చన్న, సతీష్, సుధాకర్, బాబు, దుబ్బన్న, కుమార్ ఉన్నారు.

'ఆరోగ్య మహిళ'పై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ స్వరూపరాణి

మల్దకల్: ఆరోగ్య మహిళాపై ప్రతి ఒక్కరి అవగాహన కల్పించాలని డాక్టర్ స్వరూపరాణి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఆరోగ్య మహిళాపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ గ్రామాలలో గర్భిణీ, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



మట్టిని చదును చేస్తున్న జేసీబీ

గుంతలకు మరమ్మతు

అయిజ: మండలంలోని వెంకటాపురం స్టేజి–వెంకటాపురం గ్రామం మధ్యలో ఉన్న ప్రధాన రహదారి గుంతలమయంగా మారి ప్రయాణానికి ఆటంకంగా మారింది. గ్రామస్తుల ఇబ్బందులను గమనించి సర్పంచ్ తిమ్మక్క తనయుడు చిన్న తిమ్మన్న, ఎంపీటీసీ వేణుగోపాల్‌రెడ్డి గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకున్నారు. గుంతలలో మొరం వేయించి రోడ్డు రోలర్ చదును చేయించారు. మెగా కంపెనీ సూపర్‌వైజర్ సహకారంతో పనులు చేశామని వారు పేర్కొన్నారు. రోడ్డుకు మరమ్మతు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం

ధరూరు: బీజేపీ బలోపేతమే లక్ష్యమని బీజేపీ జిల్లా నాయకుడు కుర్వ కిష్టన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటి వివరాలతో కూడిన బ్రోచర్లను ప్రజలకు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ పథకానలు వివరించారు. బ్యాంకు ఖాతా ఉండి 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు వారందరికి కేవలం రూ.436తో రూ.2 లక్షల బీమా సౌకర్యం, కేవలం రూ.20 రూపాయల చెల్లింపుతో రూ.2 లక్షల ప్రమాదబీమా సౌకర్యం కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సవారన్న, బీజేపీ నాయకుడు రామిరెడ్డి, రాములు, రాజు, సుధాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ పట్టణ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

గద్వాల: మండలంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం ఏర్పాటు చేసిన పట్టణ వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా వాసవీ క్లబ్ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అధ్యక్షుడిగా నరహరి హనుమంతయ్య, ప్రధాన కార్యదర్శిగా పత్తి శ్రీహరి, కోశాధికారిగా ఎల్కూర్ అశోక్‌లతో పాటు పలువురు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కార్యవర్గాన్ని జిల్లా ఆర్యవైశ్య సంఘం, ఆవోపా నాయకులు వేర్వేరుగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలూరు రాము, కౌన్సిలర్ శ్రీనివాసులు, సురేష్, మరడి శ్రీకాంత్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.